www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 నవంబర్ 2023

5

చిత్తూరు

చిత్తూరు జిల్లాలో ప్రవేశించిన భేరి

మారుమోగిన ప్రజా 'భేరి'

- ర్యాలీలు, వినతులు, క్షేత్రస్థాయి పరిశీలనలు
- చిత్తూరు, తిరుచానూరు, తిరుపతిలో సభలు
- నేడు రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరుల్లో...
- ఆలోచింపజేసిన కళాకారుల 'పన్నుల' నాటిక

బంగారుపాళ్యంలో మాట్లాడుతున్న వి.క్రిష్ణయ్య

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి, యంత్రాంగం

ప్రధాన బూర్జువా పార్టీలన్నీ కుర్చీల కోసం కొట్లాడుకుంటూ యాత్రలు చేస్తుంటే, సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్ర మాత్రం ప్రజా సమస్యల కోసం ప్రజలు పోరాడేలా చైతన్యవంతులను చేస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాలో రెండు రోజుల పాటు యాత్ర కొనసాగనుంది. తొలిరోజు శనివారం యాత్ర ఆద్యంతం స్వాగతాలు, ర్యాలీలు, వినతులు, క్షేత్రస్థాయి పరిశీలనలతో ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం 9 గంటలకు రేణిగుంటలో, 11 గంటలకు శ్రీకాళహస్తిలో, 1 గంటకు గూడూరులో యాత్ర కొనసాగనుంది. కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రారంభమైన యాత్ర శనివారం నాటికి ఎనిమిది జిల్లాల్లో పర్యటించినా రాష్ట్ర నాయకత్వంలో గానీ, కళాకారుల్లో గానీ ఎక్కడా కించిత్తు విసుగు లేకుండా ఆద్యంతం అదే ఉత్సాహంతో సాగింది.

సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర అన్నమయ్య జిల్లా నుంచి చిత్తూరు జిల్లాలోకి శనివారం ఉదయం ప్రవేశించింది. గంగవరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి సిపిఎం కార్యకర్తలు, ప్రజాసంఘాలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడనుంచి స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. యాత్ర ఆద్యంతం కరువు గాథలు తమకు ఎన్నో కనిపించాయని, బాధితులు వినిపించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రం మాట మార్చి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పలమనేరులో పట్టు, పాడి, మామిడి రైతులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లభించేవరకూ కోల్డ్‌స్టోరేజీలు నిర్మించి నిల్వ ఉంచాలని కోరారు. బంగారుపాళ్యంలో సిపిఎం రాష్ట్ర నాయకులు వి.క్రిష్ణయ్య మాట్లాడారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. 60వేల టిఎంసిల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతుందన్నారు. పాదయాత్ర సందర్భంగా ఈ ప్రాంతానికి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీని ఒక్కటైనా నిలబెట్టుకున్నారా? అని ప్రశ్నించారు.

యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర నాయకులు ఉమా మహేశ్వరరావు, దయా రమాదేవి, శివ నాగరాణి, సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, చైతన్య సురేంద్ర, ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. యాత్ర బృందానికి పంచాయతీ కార్మికులు, హమాలీ వర్కర్స్, టీచర్లు, చేనేత కార్మికులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నం భోజనం కార్మికులు తదితరులు తమ సమస్యలు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రాలు సమర్పించారు. పాకాలవారిపల్లి వద్ద తిరుపతి జిల్లాలోకి యాత్ర ప్రవేశించింది. అక్కడనుంచి తిరుచానూరు యోగిమల్లవరంలో సభ సుమన్ అధ్యక్షతన జరిగింది. అనంతరంలో జోరువానలో బహిరంగ సభ సాగింది.

బిజెపికి బుద్ధి చెప్పాలి : సిపిఎం

అభివృద్ధిని విస్మరించిన బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం కేంద్రకమిటి సభ్యులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ గఫూర్, డి.రమాదేవి అన్నారు. తిరుచానూరు, తిరుపతిలో ప్రజారక్షణ భేరి సభలు శనివారం సాయంత్రం జరిగాయి. తిరుపతి పాత కార్పొరేషన్ కార్యాలయం వద్ద సభ జరుగుతున్న సందర్భంగా జోరున వాన కురిసింది. రాయలసీమకు ప్రత్యేక నిధుల ఊసే లేదన్నారు. కడప ఉక్కు కర్మాగారం మాట దేవుడెరుగు, ప్రస్తుతం విశాఖలో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను సైతం కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్రం పూనుకోవడం బాధాకరమన్నారు. రాజధానికి ఇస్తామన్న నిధులు ఇవ్వలేదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బిజెపిని, ఆ పార్టీకి మోకరిల్లుతున్న టిడిపి, వైసిపి, జనసేనలకు బుద్ధి చెప్పాలన్నారు. ఇటీవల తిరుపతి శెట్టిపల్లి భూములకు పట్టాలివ్వడం శుభపరిణామని, ఇచ్చిన పట్టాలకు భూములు చూపించాలని, ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ఉల్లిగడ్డలు, టమోటాలు కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశ సంపదనను అదానీ, అంబానీలకు మోడీ దోచి పెడుతున్నారన్నారు. భిన్నమతాలు, బిన్న సంస్కృతులు ఉన్న దేశంలో ఒకే మతం, ఒకే సంస్కృతి అనేలా వ్యవహరించడం శోచనీయమన్నారు. తమ బస్సు యాత్ర వస్తున్న రోడ్లకు ఇరువైపులా లక్షలాది ఎకరాల భూములు బీడుగా మారాయన్నారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి అంటేనే బిజెపికి నచ్చడం లేదన్నారు. తిరుపతిలో ఫ్లై ఓవర్ నిర్మించకూడదని, అండర్ డ్రైనేజి వ్యవస్థ నిర్మాణం చేపట్టకూడదని, ఆఖరికి ఆస్పత్రుల నిర్మాణం చేపట్టినా అడ్డుకోవడమే బిజెపి పనిగా పెట్టుకుందన్నారు. రాబోవు రోజుల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జోరు వాన కురుస్తున్నా ప్రజలు సిపిఎం సభలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు చల్లా వెంకటయ్య, కందారపు మురళి, టి సుబ్రహ్మణ్యం, హేమలత, సాయి లక్ష్మి, నాగార్జున, జయచంద్ర, బుజ్జమ్మ, గంగులప్ప, వేణు, మునిరాజా పాల్గొన్నారు.

తిరుపతిలో...

నేటి సభను జయప్రదం చేయాలి : బివి రమణయ్య

గూడూరు టౌన్ : గూడూరులోని మార్కెట్ సెంటర్‌లో ఆదివారం జరగనున్న ప్రజా రక్షణ బేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు బి.వి.రమణయ్య కరపత్రాలను పంచిపెట్టారు.

పంచాయతీ కార్మికురాలి సమస్యలు తెలుసుకుంటూ...

కళారూపాలు

తిరుచానూరులో...

భేరికి స్వాగతం పలుకుతున్న సిపిఎం శ్రేణులు

10, 11 తేదీల్లో కరువు ప్రాంతాల్లో పర్యటన

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రభుత్వానికి కామన్ మ్యాన్ కష్టం పట్టడం లేదని, కరువు పీడిత ప్రాంతాల ప్రజలను తక్షణమే ఆదుకోవాలని, కృష్ణా రివర్ బోర్డును కర్నూల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10, 11 తేదీల్లో క్షేత్రస్థాయిలో కరువు ప్రాంతాలను సందర్శించనున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి, గుజ్జల ఈశ్వరయ్య, డి.జగదీష్ వెల్లడించారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుంటే నివారించాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ కామన్‌మ్యాన్ కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి మెమోరియల్ హాల్లో కరువు ప్రాంత ప్రజలను తక్షణమే ఆదుకోవాలని చేపడుతున్న క్షేత్రస్థాయి కరువు పరిశీలన కార్యాచరణ కొరకు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సిపిఐ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, రైతుసంఘం నాయకులతో పి.మురళి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో 18 జిల్లాల్లో 444 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే కేవలం ఏడు జిల్లాల్లో 13 మండలాల్లో మాత్రమే కరువు ఉందని సిఎం ప్రకటించడం అత్యంత దారుణమన్నారు. తిరిగి సిఎం ఎలా అవ్వాలనే ధ్యాస తప్ప, జగన్మోహన్‌రెడ్డికి కరువు పట్టడం లేదన్నారు. రోం నగరం తగలబడి పోతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈనెల 10. 11 తేదీల్లో కరువు ప్రాంతాల్లో సిపిఐ బృందం పర్యటించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం జిల్లాల అధ్యక్షులు దామా అంకయ్య, పి.మురళి, ఎస్.నాగరాజు, పిఎల్ నరసింహులు, బి.గోవిందు పాల్గొన్నారు.

ఈచర్ ట్రావెల్స్, బస్సు ఢీ

10 మంది వలస కూలీలకు తీవ్ర గాయాలు

పజాశక్తి- వి.కోట

మండల పరిధిలోని కొమ్మరమడుగు మలుపులో ఈచర్, ట్రావెల్స్ బస్సు ఢీకొన్న సంఘటనలో పదిమంది వలస కూలీలు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... ఉపాధి కోసం ఒరిస్సా నుంచి కేరళకు వెళుతున్న కూలీల బస్సు ప్రమాదవశాత్తు కొమ్మరమడుగు సమీపంలో ఎదురుగా వస్తున్న ఈచర్ వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 10 మందికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను వీకోట ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు కుప్పం పిఇఎస్ కు తరలించారు.

ఈ ప్రమాదంలో రెండు వాహనాలకు చెందిన ముందు భాగాలు ఇరుక్కుపోయాయి. ఇరుక్కుపోయిన రెండు వాహనాలను జె సి బి యంత్రం సాయంతో గ్రామస్తులు, అధికారులు తొలగించారు. మానవత్వంతో సహాయక చర్యల్లో గ్రామస్తులు అధికారులకు సహకరించారు. వర్షం కురుస్తుండటంతో ప్రమాదకరమలుపులో వేగంగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వెంకటే గౌడ సంఘటనా స్థలం వద్ద దిగి ప్రమాద విషయాలను అడిగి తెలుసుకున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న కూలీలకు మెరుగైన వైద్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. వికోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలస కూలీల ప్రమాద ఘటన

పారిశ్రామిక అభివృద్ధిపై సమావేశాలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పారిశ్రామిక అభివృద్ధి విధానంపై నగరి, పుంగనూరు నియోజకవర్గాలలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన నగరి వెలు గు సమావేశ మందిరంలో, 9న పుంగనూరు ఎంపిడివో కార్యా లయ ంలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని పే ర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు హాజరవ్వాలని కోరారు.

సివిల్ సర్వీస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు తెగల సహకార, సాధికారిత అధికారి ఎస్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. యుపిఎస్‌సి నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారి కోసం ప్రభుత్వ ఆర్థిక సాయానికి ఈ పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. షెడ్యూల్డు తెగలకు చెంది రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందని వివరించారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించినవారికి రూ.50వేలు నగదు ప్రోత్సాహం అందజేయడం జరుగుతుందన్నారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన చిత్తూరు జిల్లాలోని షెడ్యూల్డు తెగల వర్గాలకు చెందిన వారు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

అర్థమయ్యేలా విద్యను బోధించాలి

జెడ్పి సిఈవో ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: విద్యార్థులకు అర్థ మయ్యేలా విద్యను బోధించాలని జెడ్పి సీఈవో ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయు లకు సూచించారు. మండలంలోని రాయ లపేట ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికా ర్డులు పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యా ర్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల వంటగది, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. మరుగుదొడ్ల నుంచి మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ ఏర్పాటు చేయించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి గణపతిని ఆదేశించారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంపిడివో అబ్దుల్ రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గుర్తు తెలియని వాహన ఢీకొని వృద్ధుడు మృతి చెం దిన సంఘటన శనివారం తిమ్మోజిపల్లి సచివాలయ సమీపంలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజరావు వివరాల మేరకు.. తిమ్మోజిపల్లి గ్రామానికి చెందిన రాజేంద్రరెడ్డి(70) రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు చెప్పారు. తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే రాజేంద్రరెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు శెట్టిపల్లికి మోక్షం

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శెట్టిపల్లి భూములు ఇది దశాబ్దాలుగా కొలిక్కిరాని సమస్య. రాష్ట్ర వ్యాప్తగా చర్చనీయాంశమైన అంశం. అక్కడి రైతుల ఔదార్యం చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి నాంది అయ్యింది. కానీ రైతులకు మాత్రం పంటలు పండే భూములు కూడా కనుమరుగయ్యాయి. తమ అధీనంలోనే భూములు ఉన్నా పట్టాలు మాత్రం లేవు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా రైతుల సమస్య మాత్రం ఎక్కడేసిన గొంగిడి అక్కడే అన్నట్టుగా తయారైంది. ఎట్టకేలకు స్థానికులు, రైతులు గట్టిగా నిలబడడంతో, వామపక్షాలు మద్దతుగా నిలిచాయి. స్థానిక ఎంఎల్‌ఏ చొరవ చూపడంతో అధికారులు దృష్టి సారించారు. మూలనపడి ఉన్న ఫైల్‌కు చలనం వచ్చింది. ప్రభుత్వ అంగీకారంతో రైతులకు పట్టాలు అందించి, సుదీర్ఘ నిరీక్షణకు తెరదింపడం గమనార్హం.

శెట్టిపల్లి పంచాయతీ. తిరుపతి రూరల్ మండలంలోని మేజరు పంచాయతీల్లో ఒకటి. విశాలమైన భూములు, సారవంతమైన నేలలు..చుట్టు పంటపొలాలు. ఒకవైపు రైతులు నివాసులు, మరోవైపు నిత్యం నీటితో కళకళలాడే చెరువు, ఇంకో వైపు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ (సిఆర్‌ఎస్), శేషచల కొండలకు అతి చేరువలో, రైల్వేజంక్షన్ రేణిగుంటకు, ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతికి మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఉంటుందా ఊరు. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు చుట్టు బీడుభూములు, తాగేందుకు చుక్క నీరు లేకుండా, పంటలు పండించుకునే అధికారం లేకుండా అక్కడ రైతుల బాధలు వర్ణానాతీతం. ఈ భూములకు పట్టాలు లేకపోవడం నిత్యం ప్రభుత్వంతో పోరాటమే. దశాబ్దాల తరబడి రైతులు పోరాడుతూనే ఉన్నారు. రాష్ట్ర విభజన శెట్టిపల్లికి శాపంగా మారింది. అక్కడున్న సారవంతంమైన, విశాలమైన భూములపై ప్రభుత్వం కన్నుపడింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అమరావతిలో చేసిన విధంగా శెట్టిపల్లిభూములను ల్యాండ్‌ఫ్యూల్లింగ్ ద్వారా తీసుకుని, అభివృద్ధి చేయాలని భావించింది. అందుకు 2018లో నోటిఫికేసన్ జారీ చేసింది. సుమారు 600 ఎకరాలు సేకరించారు. ల్యాండ్‌ఫ్యూల్లింగ్‌లో భూములు కోల్పోయిన వారికి పరిహారంగా రైతులకు ఎకరాకు 362 అంకణాలు (30.16సెంట్లు) భూమి ఇస్తామన్నారు. ఇళ్లస్థలాల యాజమానులకు ఒకటిన్నర సెంటు (18 అంకణాల) భూమిని అభివృద్ధి చేసి ఇస్తామన్నారు. ఆ పరిహారం చాలదు రైతులకు ఎకరాకు 400 అంకణాలు (33.33 సెంట్లు) ఇవ్వాలని పట్టుబట్టారు. దీన్ని తేల్చకుండా గత ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసింది. ఇంతలోనే ఎన్నికల నోటిఫికెషన్ వచ్చింది. ఎన్నికల తర్వాత వైసిపి ప్రభుత్వం కొలవుదీరింది. టిడిపి కంటే మెరుగైన పరిహారం ఇస్తామన్నారు. కొత్త సర్కారు న్యాయం చేస్తుందని భూ యజమానులు ఆశించారు.

తుడా టౌన్‌షిప్ తెరపైకి

2019లో తుడా ఆద్వర్యంలో ఆ ప్రాంతంలో టౌన్‌షిప్ నిర్మాణానికి అంగీకరించారు. 2019 జూన్ 26న రెవిన్యూ, తుడా నేతృత్వంలో భూముల సర్వేకు నోటిఫికేషన్ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన సర్వే, హక్కుదారులు సమర్పించిన రికార్డులు చెల్లవంటూ... మరోసారి భూ సర్వేకు, హక్కుదారుల రికార్డులు పరిశీలనకు తెరతీశారు. పాలకుల నిర్ణయాల కారణంగా 251 రైతులు, 2206 మంది ఇళ్ల స్థలాల కొనుగోలుదారులు మరోసారి రికార్డులు సమర్పించారు. ఈ నేపథ్యంలో 2019 ఆగస్టు 4న ఆర్‌డివో నేతృత్వంలో శెట్టిపల్లి భూ బాధితులతో తొలిసమావేశం నిర్వహించారు. భూములు సేకరణ, టౌన్‌షిప్ నిర్మాణం, పరిహారం విషయంపై చర్చించారు. అందరికి అమోదయోగ్యమైన పరిహారం ఇవ్వాలని రైతులు స్పష్టం చేశారు. అనంతరం సెప్టెంబరు 28న అర్హులు, లబ్దిదారుల జాబితాను ప్రకటించారు. టౌన్‌షిప్ నిర్మాణానికి ముందుకెళ్లుతున్నట్లు తుడా అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదల చేసి ఏడాదైనా కార్యచరణ ప్రారంభం కాలేదు.

తుడా టౌన్‌షిప్ నిర్మాణం కాలయాపన జరుగుతుందని తెలుసుకున్న స్థానిక ఎంఎల్‌ఏ శెట్టిపల్లిని కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు పూనుకున్నారు. పంచాయతీలోని గ్రామపాలకమండలిని సమావేశపరిచి, గ్రామసభలో అందుకు తగ్గట్టు తీర్మానం చేయించారు. విషయం తెలుసుకున్న తుడా అధికారులు తమకు కేటాయించిన 137.85 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలకు పూనుకున్నారు. సంబంధిత అధికారులు 2023 జనవరి 11న 4 బృందాలుగా సర్వేకు వెళ్లారు. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న ఓ ప్రజాప్రతినిధి కలెక్టరేట్‌లో చక్రం తిప్పి సర్వే అధికారులను ఉన్నఫలంగా వెనక్కి రప్పించారు. పరిస్థితి చేయదాటకముందే తేరుకోవాలని భావించిన ఆయన విలీనానికి చర్యలు ముమ్మరం చేశారు. యుద్ధ ప్రతిపాదికన మూడే మూడు రోజుల్లో వీలిన ప్రక్రియను పూర్తి చేశారు. 01.03.2023లో అందుకు సంబంధించిన ప్రభుత్వం గెజిటెడ్ విడుదల చేసింది. కోట్ల విలువ చేసే శెట్టిపల్లిభూముల్లో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎంఎల్‌ఏలు మధ్య ఆదిపత్య పోరు తప్పలేదు. విలీనం అయినా అక్కడ వారి సమస్యలు పరిష్కారం కాలేదు. ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. శెట్టిపల్లి భూములను ఎప్పటికి శాపవిమోచన జరుగుతుందోనని అక్కడి రైతులు ఎదురుచూశారు. ఎట్టకేలకు త్వరలో జరుగబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాబోలు ఏదో విధంగా రైతుల భూములకు పట్టాల పంపిణీకి స్థానిక ఎంఎల్‌ఏ చొరవ చూపారు. అంతే అనుకున్నదే తడువుగా మూలనపడ్డ ఫైల్‌కు చలనం వచ్చింది. ఆగమేఘాలపై అమరావతిలో ఉన్నతాధికారులు చర్చించి, పట్టాలకు అంగీకరించి, సిఎంకు ఆమోదాన్ని సైతం పొందారు. అందరు ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. నవంబరు 1వ తేదిన శెట్టిపల్లి రైతులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ గ్రామానికి చేరుకుని పట్టాలను అందజేశారు. దీంతో రైతుల మోహాల్లో ఆనందం వెల్లివిరిసింది.

(ఫైల్‌ఫొటో)

ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు అర్బన్: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డిఆర్‌ఒ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజలు ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో శనివారం చిత్తూరు మాపాక్షి పోలింగ్ కేంద్రం 147, 148, తుమ్మిందలో 176, 177, 178 కేంద్రాలలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. డిఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని 1762 పోలింగ్ కేంద్రాల్లో శనివారం, ఆదివారం, డిసెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహంచడం జరుగుతోందన్నారు. బిఎల్‌వోలు అందుబాటులో ఉండి ఓటరు అభ్యర్థలను స్వీకరిస్తారని పేర్నొన్నారు. శిబిరాల నిర్వహణను మండల తహశీల్దార్‌లు, ఆర్‌డివోలు, ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. అక్టోబర్ 27న విడుదలైన ఓటరు జాబితోలో తప్పులు ఉంటే వాటిని డిసెంబర్ 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

బైరెడ్డిపల్లి: ఓటరు నమోదు కేంద్రాలను శనివారం పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఓటరు జాబితా నమోదు, సవరణకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో బిఎల్‌వోలు, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కుమారస్వామి, వీఆర్‌వో రాజేష్, వెంకటేష్, బిఎల్‌వోలు గుణశేఖర్, భారతి, భాను పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో బిఎల్‌వోలు నిర్వహించిన ఓటరు నమోదు క్యాంపును డిప్యూటి కలెక్టర్ భవాని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఇన్నునాథన్, టిడిపి నాయకులు గోపి, రాజేష్, పృద్వి సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: కొత్త ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక కమిషనర్ అరుణ అన్నారు. నగరపాలక కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సిబ్బందికి దిశానిర్ధేశం చేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్చ్వో డా.లోకేష్, ఎంఈ గోమతి, ఏస పీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఎంఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి త్రిశూల్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ధనంజయరెడ్డి, ప్రిన్సిపల్ విజయులురెడ్డి, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డివో

సోమల: మండలంలోని వివిద పోలింగ్ కేంద్రాలను శనివార తహశీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి, డిప్యూటి తహశీల్దార్ రామమూర్తి పరిశీలించారు. సిబ్బందికి దిశానిర్ధేశం చేశారు.

రామకుప్పం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ మురళి పరిశీలించారు. నూతన ఓట్ల నమోదు, సవరణకు సంబంధించి బిఎల్‌వోలకు సూచనలు ఇచ్చారు.

ఓటరు జాబితా సవరణపై నేడు స్పెషల్ కాంపెయిన్

నగరి: ఓటరు జాబితా సవరణకు ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో సుజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బిఎల్‌వోలు అందుబాటులో ఉండాలన్నారు.

సెల్ టవర్ వద్ద భయం.. భయం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని బిఎస్ఎన్ టవర్ నిచ్చెన మరమ్మత్తులకు గురైంది. దీంతో టవర్ సమీపంలో నివసిస్తున్న కుటుంబీకులు భయంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టవర్ నిచ్చెనను కోతులు లాగడంలో నిచ్చెన పై భగం టవర్ నుంచి విడిపోయి వేలాడుతోంది. ఎప్పుడైనా కిందపడే అవకాశం ఉంది. దీంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

టవర్ నుంచి విడిపోయి వేలాడుతున్న నిచ్చెన

రోడ్డుపై కూలిన మర్రి చెట్టు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి-కడపనత్తం జాతీయ రహదారిలో కమలవంక వద్ద భారీ మర్రి చెట్టు గాలి బీభత్సానికి రోడ్డుపై కూలింది. దీంతో ఏడు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. చెట్టుకూలపోవడంతో రెండు విద్యుత్ స్థబాలు మరమ్మత్తులకు గురైయ్యాయి. స్థానికులు ఏఈ హెమచంద్రుడినికి సమస్యను తెలిపారు. స్పందించిన ఏఈ సమస్యను పరిష్కరించారు.

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

బావిలో పడ్డ వ్యక్తిని కాపాడిన గ్రామస్తులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రమాదవశాత్తు బావిలో పడ్డ వ్యక్తిని తోటి గ్రామస్తులు కాపాడారు. మండలంలోని నూరేవారిపల్లికి చెందిన రవికుమార్(35), తన భార్య కవితతో కలసి శనివారం వంట చెరకు కోసం సమీప పొలం వద్దకు వెళతారు. బావి సమీపంలో కట్టెలు కొడుతూ రవికుమార్ ప్రమాదవశాత్తు నీరు లేని బావిలో పడిపోయాడు. కవిత కేకలు వేయడంతో పక్కన పొలంలో ఉన్న గ్రామస్తులు రవికుమార్‌ను కాపాడారు. తీవ్ర గాయాలతో ఉన్న రవికుమార్‌కు కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు.

రవికుమార్‌ని రక్షిస్తున్న గ్రామస్తులు

ఎయిర్‌పోర్టు అడ్వైజరి కమిటీ మెంబర్‌గా శేషశయన రెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ అడ్వైజరి కమిటీ మెంబర్ గా గాజులమండ్యంకు చెందిన పన్నీరుకాల్వ శేషశయన రెడ్డి (పన్నీరుకాల్వ శ్రీధర్ రెడ్డి) నియమితులయ్యారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం అడ్వైజరి కమిటీ మెంబర్ గా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి అత్యంత ఆప్తులు. రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి వైసిపి సీనియర్ నాయకులు పన్నీరు కాల్వ శేషశయన రెడ్డి (పన్నీరుకాల్వ శ్రీధర్ రెడ్డి)నీ తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం చైర్మన్ తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి సిఫారసు మేరకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశాలతో విమానాశ్రయం డైరెక్టర్ బసవరాజు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి విమానాశ్రయం అడ్వైజర్ కమిటీ మెంబర్ గా నియమించినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి లకు కృతజ్ఞతలు తెలిపారు. పన్నీరుకాల్వ శేషశయన రెడ్డి (పన్నీరుకాల్వ శ్రీధర్ రెడ్డి) తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం అడ్వైజర్ కమిటీ మెంబర్ గా ఎన్నికవ్వడంతో వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పన్నీరుకాల్వ శ్రీధర్ రెడ్డి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

రోపి స్కిప్పింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సోమల జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరచాడు. మదనపల్లిలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు సోమల పాఠశాల విద్యార్థి షేక్ మహ్మద్ రియాన్ ఎంపికైయ్యాడు. శనివారం పాఠశాల హెచ్‌ఎం వివరాలను తెలిపారు. విద్యార్థి మహ్మద్‌ని అభినందించారు. అదేవిధంగా తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి టెక్వాన్డో పోటీలలో బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. శుక్రవారం తిరుపతిలోని మెడికల్ కళాశాల ఇందిరా భాయి మెమోరియల్ హాల్ నందు నిర్వహించిన పోటీలలో పెరుమాళ్ళ పల్లె పాఠశాలకు చెందిన విద్యార్థులు నాగేంద్ర, మోహన్, చైత్ర గోల్డ్ మెడల్ అందుకున్నారు. త్వరలో కడపలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి తెలిపారు.

టిడిపి నేత మృతికి నివాళులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వరత్తూరు పంచాయతీకి చెందిన టిడిపి నేత కృష్ణారెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. కృష్ణారెడ్డి మృతదేహానికి పలువురు టిడిపి నేతలు నివాళులు అర్పించారు. టిడిపి నేతలు స్వామిదాస్, కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, జ్యోతి యాదవ్, నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

టీకాలు నిర్వహణను పరిశీలిస్తున్న సిహెచ్‌వో

ప్రజాశక్తి-యాదమరి: వ్యాధినిరోదక టీకాలు వందశాతం వేసి మతాశిశు మరణాలు తగ్గించాలని సిహెచ్‌వో లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని ఆరిమాకులపల్లిలో జరుగుతున్న వ్యాధి నిరోదక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు అయ్యేలా గర్భవతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్త భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం దాతలు భక్తులకు అన్నదానం చేపట్టారు. ముందుగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు టిటిడి ఆలయ అధికారి సురేష్‌కుమార్ దర్శన ఏర్పాట్లు చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాస్ ఆర్సీపీపీ కోఆర్డినేటర్

ప్రజాశక్తి-కార్వేటినగరం: మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్యత్ అందకారం అవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజియులురెడ్డి అన్నారు. కళాశాలలో శనివారం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనార్ధలాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాస్ ఆర్సీ ఏపీ నాగరాజు, శబరిదేవీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు, వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి, అధ్యాపకులు హరిబాబు, శివరామకృష్ణ, భార్గవి, కార్తిక్, లావణ్య పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-సోమల: ప్రతి కార్యకర్త పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర వైసిపి కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మండలంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, క న్వీనర్లు, గృహసారధులు, కార్యకర్తలతో ఆయన సమావే శం నిర్వహించి మాట్లాడారు. బూత్ కమిటీలను ఏర్పా టు చేసుకొని డిసెంబర్ 5వ తేదీ లోపు ఓటర్ల నమోదు, సవరణ వంటివి పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి అమాస కుసుమమోహన్, వైస్ ఎంపిపి ప్రభాకర్, ఎంపిటిసి సర్వేశ్వరి, నాయకులు వాసుదేవయ్య, రమణారెడ్డి, బాషామసూద్, సుందరరాజు, గండికోట రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంఈవో విజయకుమార్ అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో శనివారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లను విధిగా పరిశీలించి సంతకాలు చేయాలన్నారు. విద్యార్థుల ప్రగతిని తరగతుల వారీగా మూల్యాంకనం చేసి ఆన్లైన్ నందు నమోదు చేయాలి. బడి బయట పిల్లలను పాఠశాలలో ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

ఇళ్ల స్థలాలు మంజూరుకు క్యాబినెట్ నిర్ణయం పట్ల జర్నలిస్టులు హర్షం

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సుధీర్ఘకాలంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులు శుక్రవారం రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాథం మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చిత్తూరులో తొలిసారి వినతిపత్రం అందజేశామన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఎలాగైతే ఉద్యమించామో ప్రభుత్వం మంజూరు చేసినప్పుడు కృతఘ్నత తెలిపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇళ్ల స్థలాలు మంజూరులో అక్రిడేషన్ అంశాన్ని పక్కనబెట్టి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారందరికీ లబ్ధిచేకూర్చాలని కోరారు. 20ఏళ్ల నుంచి జర్నలిస్టులు స్థలాల కోసం చేస్తున్న పోరాలను ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కోశాధికారి పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులు ప్రదీప్, అయ్యప్ప నాయుడు, చంద్రశేఖర్, శివ, సీనియర్ పాత్రికేయులు వీర రాఘ వులునాయుడు, వరదరాజులు, శివకుమార్, బాలసుందరం, రాజేష్, హరీష్, సురేష్, కృపానందరెడ్డి, శ్రీనివాసులు, చిరంజీవి, కృష్ణ సింగ్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గ్రామాలు, వార్డుల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం అని చిత్తూరు నగరపాలక మేయర్ అముద అన్నారు. శనివారం చిత్తూరు 7వ వార్డులో నిర్వహించిన వైద్య శిబిరాన్ని మేయర్ ఆముద, డిప్యూటి మేయర్‌లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ ఖరీదైన వైద్య సేవలను ప్రజల చెంతకు తీసుకురావడంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. అనంతరం శిబిరంలో సురక్ష కిట్‌లను పంపిణీ చేశారు. అంగన్వాడి, డ్వాక్రా మహిళల స్టాల్స్‌లను సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మధుబాబు, ఎంహెచ్చ్వో డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న మేయర్

కానరాని వర్షం.. చేజారుతున్న కర్షకుని కష్టం

- ఎండుతున్న వేరుశనగ పంట
- ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి-సోమల: వర్షాలు కురవక.. పంటలు తడవక.. చేతికొచ్చే ఫలసాయాన్ని కాపాడుకోలేక వైరుశనగ పంట రైతుల గోడు వర్ణనాతీతంగా ఉంది. జిల్లాలో అనేక చోట్ల వేరుశనగ పంట వేసిన రైతులకు ఈ దఫా ఆశలు ఆవిరి అయినట్లే తెలుస్తోంది. ప్రభుత్వ సబ్సీడీలో వేరుశనగ తీసుకున్న రైతులు తొలత కొద్దిపాటి వర్షాలతో రైతులు విస్తారంగా విత్తనాలు చల్లారు. కాగా పంటలు ఆశించిన మేరా వచ్చినా చేతికొచ్చే సమయానికి వానలు ఉసూరుమనిపించాయి. దీంతో చేసిన కష్టాన్ని వదులుకోలేక, చేతికందే పంటను కాపాడుకోలేక అన్నదాత ఆవేదన బాధిస్తోందనే చెప్పాలి. మరో వైపు పంటలు పండించడానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలసాయాన్ని అందుకొనేందుకు పంటకు బోరుబావుల నుంచి పైపులైనుతో నీరు పెట్టాల్సిన పరిస్థితి. బోర్లు అందుబాటులో లేని రైతులైతే అశలు వదులుకున్నారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది.

సోమలలో వేరుశనగ పంటకు పైపులైను ద్వారా నీరు పడుతున్న రైతు

బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఏపీ బాలికల గిరిజన సంక్షేమ జూనియర్ కళాశా లలో శ్రీకాళహ స్తి కోర్టు ఆధ్వర్యంలో బాలికల చట్టాలు, హక్కులపై శనివారం అవగా హన కల్పిం చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే బాలికలు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళల అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్న బాల్య వివాహాలు లాంటి సామాజిక రుగ్మతల నుంచి విముక్తి పొందచ్చని తెలిపారు. న్యాయ ఉచిత సలహాల కోసం 15100 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మల్లికార్జునయ్య, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కారులో చోరీ.. మెనేజరు వర్రీ!

- సినీఫక్కిలో బంగారం అపహరణ - చిత్తూరు నగరంలో చోరి కలకలం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పట్టపగలే దాచిన బంగారం మాయమైంది. సినీ ఫక్కీలో కారులోంచి బంగారును కేటుగాళ్లు అపహరించేశారు. గోల్డ్‌లోన్స్ సంస్థ ఉద్యోగిని ఉక్కిరిబిక్కిరి చేశారు. తీరా లబోదిబోమంటూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. చిత్తూరు పట్టనంలోని ప్రకాశం రోడ్డులో రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కీర్తన గోల్డ్ లోన్స్ సంస్థ వద్ద శనివారం రూ.45లక్షల బంగారం చోరి జరిగింది. ఇటీవల గోల్డ్‌లోన్స్ సంస్థకు భారీగా బంగారం సమకూరింది. దీంతో ఆ సంస్థ రీజనల్ మేనేజరు జాన్‌బాబు బంగారాన్ని ప్యాక్‌చేసుకొని కారులో పెట్టి లాక్‌చేశాడు. హోటల్ గదికి వెళ్లి తిరిగి వచ్చేలోపు బంగారం మాయమైనట్లు గుర్తించి ఆందోళనతో ఉక్కిరిబిక్కిరాయ్యడు. లాక్ చేసిన కారులోంచి బ్యాగు అపహరణకు గురైనట్లు భావించి చిత్తూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు వివిద కోనాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సిసి టివి ఫుటేజి ఆధారంగా నేరస్తులను గుర్తించేపని పడ్డారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు డిఎస్పి శ్రీనివాసమూర్తి తెలిపారు.

6 నుండి పిజిసెట్-2023 మలి విడత అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి 2023 సంవత్సరానికి గాను వివిధ విశ్వవిద్యాలయాల్లో పి జి కోర్స్ చేరడానికి నిర్వహించిన ఏ పి పిజిసెట్-2023లో ర్యాంకు పొంది, యస్వీయూలో పిజి సీట్ పొందిన విద్యార్థులకు, పొందని విద్యార్థులకు రెండవ విడత ద్వారా సీట్లు పొందడానికి ఈ నెల 6వ తేదీ నుండి రిజిస్ట్రేషన్, ఆప్షన్లు ఎంపిక , విశ్వవిద్యాలయాల ఎంపిక చేసుకోవచ్చునని యస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ , సంచాలకులు ఆచార్య శ్రీమురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యస్వీయూ ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాల ఆధ్వర్యంలో ఉండే రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సు సీట్లన్నిటికీ ఆదాయ పరిమితులకు లోబడి వుంటే ఫీజు రీయింబర్సుమెంటు సౌకర్యం ఉంటుందన్నారు. ఎస్వియుఎ, ఎస్వియుఎఎస్ఎఫ్ (ఆర్ట్స్), ఎస్వియుఎస్, ఎస్వియుఎస్ఎస్ఎఫ్ (సైన్స్), ఎస్వియుసిఎస్ఎఫ్ (కామర్స్ అండ్ కంప్యూటరు సైన్స్) సీట్లకు ఫీజ్ రీయింబర్సుమెంటు సౌకర్యం వుంటుందని, పేమెంట్ స్పాన్సర్ కేటగిరీ కింద వున్న సీట్లకు రీయింబర్సుమెంటు వుండదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌టిటిపి//ె ఎట్స్.ఏపి ఎస్‌సిహెచ్ఇ. ఎపి.జివొవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా తెలుసుకుని ,మలివిడత పిజి సీట్లు యస్వీయూలో పొందవచ్చని అడ్మిషన్ల డైరెక్టర్ తెలిపారు.

డ్రాయింగ్ పోటీలలో హర్షశ్రీ ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ద స్కూల్ లో 7వ తరగతి చదువుతున్న కొప్పల హర్షశ్రీ డ్రాయింగ్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచింది. శ్రీకాళహస్తి పట్టణం లోని బంగారమ్మ కాలనీలో ఉంటున్న హర్షశ్రీ రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా నిర్వహించిన పోటీలలో డ్రాయింగ్ విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ నిర్వాహకులు హర్షశ్రీ కి బహుమతి అందించారు. ద స్కూల్ యాజమాన్యం విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రసిడెంట్ వేణుగోపాల్, ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ సురేంద్ర రెడ్డి, డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మ్యాగీక్లారా పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనారోగ్యంతో మృతి చెంది న శ్రీకాళహస్తి ఆటోనగర్ ఇంజినీరింగ్ కార్మికుడు మీర్జావలి కుటుంబానికి ఆటోనగర్ ఇంజినీరింగ్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయమందించారు. యూనియన్ అధ్యక్షుడు గోపీనాయుడు ఆధ్వర్యంలో మీర్జావలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మిర్జావలి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోహన్, ముని గోపాల్ సాదిక్ బేగ్, సుబ్రమణ్యం, తిరుపాల్ రెడ్డి, గోపాల్, మీర్జాన్ బేగ్, చిరంజీవులు, చెంగల రాయులు, మునికృష్ణ, గోపి, మణి నాయుడు, మహేష్ పాల్గొన్నారు.

నారాయణ అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న పి కె వెంకటేశ్వర్‌లాల్ గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ నుండీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పీహెచ్‌డి పట్టా పొందారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రవిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పి కె వెంకటేశ్వర్ లాల్ మాట్లాడుతూ తన థీసిస్ శీర్షిక 'రియల్ టైమ్ సెక్యూరిటీ అప్లికేషన్లలో ఫేస్ రికగ్నిషన్ కోసం న్యూరల్ నెట్వర్క్ క్లాసిఫైయర్తో మల్టీ-హెడ్ అటెన్షన్' అని తెలిపారు. తాను పరిశోధన చేసి థీసిస్ సమర్పించినందుకు పీహెచ్ డీ పట్టాని ప్రదానం చేశారని తెలిపారు. ఈ పరిశోధనలో భాగంగా ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ లో, బ్యాంకింగ్ లో, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ లో, మొబైల్ పేమెంట్స్ లాలో ఉపయోగిస్తారని తెలిపారు. తనకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన కళాశాల యాజమాన్యానికి, అధ్యాపకులకు, కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా గైడ్ డాక్టర్ యు శ్రీలక్ష్మి కృత్ఞతలు తెలిపారు. చేయటంలో సహాయ సహకారాలు అందించటమే కాకుండా సాధ్యమైనంత వరకు అన్ని వనరులు అందిస్తామని తెలిపారు. అనంతరం డాక్టర్‌వెంకటేశ్వర్ లాల్ కి అభి నందనలు తెలిపారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి: ఎంఇవో

ప్రజాశక్తి -కోట : కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఇవో మస్తానయ్య పేర్కొ న్నారు. కోట మండలం లోని ఊను గుంట పాలెంలోని ఎంపియుపిఎస్, ఎంపీపీ ఎస్ఎస్సీ 1,ఎస్సీ 2 కోట పాఠశాల లను ఎంఈఓ దారా మస్తాన య్య ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థుల అభ్యసన శక్తి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యాభ్యాసంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పలు సూచనలు, సలహాలు అందిం చారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు అందించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డిసెంబర్ 9వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. పుత్తూరు కోర్టు ఆవరణలో పోలీసు శాఖ అధికారులతో మండల న్యాయసేవాధికారి సంస్థ అధ్యక్షు లు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆధ్వర్యంలో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ డిసెంబర్ 9 వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజీకి లోబడిన అన్ని క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పోలీసులకు సంబంధించిన కేసులు పరిష్కారంపై సమీక్షించారు. ఈ సమావేశం పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, పుత్తూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి గోపాలకృష్ణ, పుత్తూరు ఎస్ఐ గౌరీ శంకర్, రామాంజ నేయులు, కార్వేటినగరం ఎస్ఐ-2. శరత్ బాబు, కార్వేటి నగరం ఎస్ఐ -2 దస్తగిరి వెదురుకుప్పం రమేష్ బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు 30 మందికి పౌష్టిక ఆహారం అందచేశారు. ముఖ్య అతిథులు గా ఏరియా ఆసుపత్రి సూపరింటెం డెంటు షరీనా, డాక్టర్ రాజా హాజరయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా మాట్లడుతూ ప్రగతి సేవా సంస్థ సేవలు అభినంద నీయమన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని ద్వారా డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారాలతో నిర్వహిస్తున్నామన్నారు.

నేడు ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను జయప్రదం చేయండి: సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అసమానతలు లేని పారదర్శక, స్పష్టమైన అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం సెంట్రల్ శాఖా కార్యదర్శి జోగి శివకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గూడూరు పట్టణం లోని పాత బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ , ట్రెజరీ, మండల కార్యాలయం, గాంధీ మున్సిపల్ బిల్డింగ్, టెలిఫోన్ ఆఫీస్ , ప్రధాన కూడళ్లలో ప్రజా రక్షణ భేరి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోగి శివ కుమార్ మాట్లడుతూ ఈ బస్సు యాత్ర ఆదివారం రేణిగుంటలో ప్రారంభమై శ్రీకాళహస్తి మీదుగా గూడూరు టవర్ క్లాక్ సెంటర్‌కు ఉదయం 11గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సు యాత్ర కు సీపీఎం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలుకుతామని, అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. అధికారం కోసం వైసిపి , టీడీపి, జనసేన, బీజేపీలు ఈ రాష్ట్రంలో ప్రజా సమస్యలు గాలి కొదిలేసి అధికారం కోసం పాకులాడుతున్నాయన్నారు. సీపీఎం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా రక్షణ పేరు తో బస్సు యాత్ర చేపట్టిం దని తెలిపారు. ఈ బహిరంగ సభలో రైతు లు, కార్మికులు, మహిళలు, యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు ని చ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య, పట్టణ కార్యదర్శి సురేష్ , బి చంద్రయ్య, పి మణి, కెవిపిఎస్ పట్టణ నాయకులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.